క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

చందర్లపాడు(నందిగామటౌన్):విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేలా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. మండలంలోని కొనాయపాలెం గ్రామంలో పదోతరగతి ఫలితాలలో ప్రతిభ చూపిన వారికి విజయవాడకు చెందిన శ్రీసాయి ఆరాధన క్షేత్రం సౌజన్యంతో అందజేసిన స్కాలర్‌షిప్‌లను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థుల విద్యాబోధనకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని సూచించారు. విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించిన ఆరాధన క్షేత్ర నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకుడు మహంకాళి మోహనరావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

120 మందికి వైద్యపరీక్షలు



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి వై.సుష్మాప్రియదర్శిని సూచించారు. అనిగండ్లపాడు ఎస్టీ కాలనీలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సుష్మాప్రియదర్శిని మాట్లాడుతూ వర్షాలు పడుతున్న ఈసీజన్‌లో ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.వ్యాయామంతోపాటు యోగా చేయాలన్నారు. యోగాతో కలిగే ప్రయోజనాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల తహసీల్దార్‌గా జాహ్నవి



కంచికచర్ల : కంచికచర్ల తహసీల్దార్‌గా పి.జాహ్నవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సుస్వాగతం రాజమండ్రికి బదిలీకాగా, విజయవాడ రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ జాహ్నవి బదిలీపై కంచికచర్ల వచ్చారు. ఈసందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ పట్టాదార్ పాసుపుస్తకాల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లోగా మంజూరు చేస్తామన్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజల రెవెన్యూ సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కారం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

పెనుగంచిప్రోలు తహశీల్దార్‌గా శాంతిలక్ష్మి



పెనుగంచిప్రోలు: మండల తహసీల్దార్‌గా ఎ.శాంతిలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు మండలానికి వచ్చిన తహసీల్దార్ వి.అమ్మాజి రాజమండ్రి జిల్లాకు బదిలీకాగా ఆమెస్థానంలో కాకినాడ నుంచి శాంతిలక్ష్మి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తహశీల్దార్ తొలుత గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ భాస్కరరావు, ఆర్ఐ జనార్దనరావు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సౌమ్యకు సత్కారం

నందిగామ టౌన్: తెలుగుదేశం ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేయలనే ఉద్దేశంతో 1996లోనే జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణకు దేశంలోనే ముందడుగు వేసిందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును హర్షిస్తూ నందిగామలోని ఆమె నివాసంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఎమ్మెల్యే సౌమ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక న్యాయం గెలవాలనేది టీడీపీ సిద్ధాంతమన్నారు. అత్యంత నిరుపేదలకు ఫలాలు అందించేందుకు వర్గీకరణ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందా పిచ్చయ్య మాదిగ, జిల్లేపల్లి బుజ్జి, వేల్పుల బిక్షాలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల దొంగలు హల్‌చల్

జి.కొండూరు: మండల పరిధిలోని మునగపాడు గ్రామంలో వరుసగా జరుగుతున్న చోరీలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే గ్రామంలో బైకులను చోరీ చేస్తున్న వ్యక్తులను జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఆ వెంటనే గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల రెండు పాడి గేదెలను చోరీ చేసిన ఘటనలో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఏడుగురిని సైతం జి.కొండూరు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కి తరలించారు. గత కొన్ని రోజులుగా దొంగలు విద్యుత్ తీగలను చోరీ చేస్తుండడంతో ఆందోళనకు గురైన రైతులు కొందరు జి.కొండూరు పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. మునగపాడుతో పాటు పక్కనే ఉన్న సున్నంపాడు, చెర్వుమాధవరం గ్రామాల్లో సైతం 50కి పైగా మోటార్ల వద్ద విద్యుత్ తీగలను చోరీ చేసినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఒకే గ్రామ పరిధిలో చోరీలు జరుగుతుండటంపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి దొంగలను పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



అనిగండ్లపాడులో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది



తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, పక్కన వైద్యసిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: తల్లిపాలతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. స్థానిక పెద్ద రామాలయం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను తల్లులకు వివరించారు. తల్లిపాలు బిడ్డకు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. తల్లి పాలతో బిడ్డ ఎదుగుదలకు, ఆరోగ్యానికి మంచి పోషణ లభిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలకు, బాలికలకు ఆరోగ్యవంతమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వ ద్వారా అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్లు గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో నాగమణి, రజని, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు రోగనిరోధక శక్తి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): తల్లిపాలతోనే పిల్లలకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి వై.సుష్మాప్రియదర్శిని అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అనిగండ్లపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సుష్మాప్రియదర్శిని మాట్లాడుతూ బిడ్డకు ఆరునెలల వయస్సు వచ్చేవరకు తప్పకుండా తల్లిపాలను ఇస్తే, పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. అదేవిధంగా పెనుగంచిప్రోలులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి : తల్లిపాలే బిడ్డకు రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా వత్సవాయి, కంభంపాడు, మంగొల్లు, భీమవరం, మక్కపేట, పెద్ద మోదుగపల్లి గ్రామాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. ఈ పాలలో అనేక రకమైన వ్యాధినిరోధక లక్షణాలు మెండుగా ఉంటాయని వివరించారు. కనీసం ఆరు నెలలవరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు తాగే బిడ్డల్లో వ్యాధినిరోధకశక్తి పెరిగి, వారు అనారోగ్యం బారిన పడకుండా ఉంటారని వివరించారు. బిడ్డకు పాలు ఇచ్చే విధానంపై బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పుల్లమ్మ, నందిత, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం, జుజ్జూరు గ్రామాల అంగనవాడీ కేంద్రాల వద్ద శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమన్నారు. తల్లిపాల తాగే బిడ్డల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే విధిగా ముర్రుపాలు తాగించాలని సూచించారు. అనంతరం తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నిప్పులపల్లి శాంతమ్మ, రమావత్ కోటి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి, అంగనవాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి : కమిషనర్

నందిగామ టౌన్: ఇంటి పరిసరాలలో నీటినిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని సూచించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా నందిగామలోని 15వ వార్డులో ఇన్‌చార్జి చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మీతో కలిసి శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. ఆమె వెంట మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆయా వార్డుల్లోని తాగునీటి సరఫరా చేసే ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసే పనులను కమిషనర్ పర్యవేక్షించారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లకు ఆదేశం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 31వ వార్డులో ఉన్న 150 అడుగుల జాతీయ జెండా ప్రాంతాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలసి శుక్రవారం పరిశీలించారు. ఈనెల 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జెండా వందనం కార్యక్రమం ఇక్కడే జరుగుతుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే తాతయ్య అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

జగ్గయ్యపేట: వత్సవాయి మండలం లింగాల ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి శుక్రవారం తెలిపారు. అనుమతి లేని క్వారీ నుంచి జగ్గయ్యపేటకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తొర్రకుంటపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎస్ఈబీ సీఐ వివరించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు వేళాయే

- నోటిఫికేషన్ విడుదల
- ఆగష్టు 8న ఎన్నికలు



పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్

పెనుగంచిప్రోలు: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల గంట మోగింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రెండు గురుకుల పాఠశాలలు, 85 ప్రాథమిక, 22 ప్రాథమికోన్నత, 26 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 135 పాఠశాలలు ఉన్నాయి. 2022 జులైలో గత ప్రభుత్వం పేరెంట్స్ కమిటీల పేరుతో రెండేళ్ల కాలపరిమితితో ఎన్నికలు నిర్వహించగా, ఈ జూలై నెలాఖరుతో ఆయా కమిటీల పదవీకాలం పూర్తయింది. ఈనేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. అందుకనుగుణంగా షెడ్యూల్ కూడా విడుదల చేసింది. ఆగస్టు ఒకటో తేదీన మేనేజ్‌మెంట్ కమిటీల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీచేశారు. అదేరోజున ఓటరు జాబితాలను ప్రదర్శించారు. ఈ ఓటర్ల జాబితాపై ఈనెల ఐదోతేదీ ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ఓటర్ల తుదిజాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తారు. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల పునర్వ్యవస్థీకరణ ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం గంటలకు 1.30నిముషాల నుంచి సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. అనంతరం నూతన కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్లు ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు పాఠశాల నిర్వాహణ కమిటీ తొలి సమావేశం నిర్వహిస్తారు.

అందరూ సహకరించాలి..



ఎస్ఎంసీ ఎన్నికకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులంతా సహకరించాలి. ఎన్నికలను ఉన్నతాధికారులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తాం. ఆయా పాఠశాలల హెచ్ఎంలంతా ఎస్ఎంసీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి.

డి రవీంద్ర, ఎంఈవో

రెండో మార్గం పనుల ప్రారంభం



పల్లగిరి గట్టుపై నుంచి రెండోమార్గం పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ టౌన్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం నుంచి భక్తులు కిందకు వచ్చేందుకు చేపట్టిన రెండో మార్గం నిర్మాణ పనులను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందించటమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రెండోమార్గం పనులను త్వరితగతిన పూర్తి చేసి భక్తులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. అయితే పల్లగిరి గట్టు ఆలయం నుంచి దిగువకు రెండోమార్గం పనులను గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. దాదాపు 50శాతం మేర పనులను పూర్తి చేసినట్లు భక్తులు చెబుతుండటం గమనార్హం.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ఏడుగురికి గాయాలు

చిల్లకల్లు (జగ్గయ్యపేట):రెండువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఏడుగురు వ్యక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి చిల్లకల్లులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ... చిల్లకల్లు ఎస్సీకాలనీలో పాతకక్షల నేపథ్యంలో రెండువర్గాల వారు శుక్రవారం రాత్రి తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. అనంతరం ఇరువర్గాల వారు చిల్లకల్లు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేశారు. సీఐ జానకిరామ్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిజెప్పి పంపించేశారు. అధికారపార్టీకి చెందినవారు మహిళలను ఇష్టానుసారంగా దూషించడమే ఈఘర్షణకు కారణమని ఎస్సీకాలనీకి చెందిన నాగబాబు అనేవ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



చెవిటికల్లులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు

కంచికచర్ల : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చెవిటికల్లు, కంచికచర్ల, గండేపల్లి, కీసర తదితర గ్రామాల్లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్వహించి గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బందితోపాటు ఇంటింటికి వెళ్లి నీటిని నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన పూలకుండీలు, గాబుల్లోని నీటిని తరచూ మారుస్తుండాలని సూచించారు. నీరు పారుదల అయ్యే ప్రాంతాల్లో అడ్డంగా రాళ్లు, జాలీలు వంటివి పెడితే నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. బ్లీచింగ్ సున్నం చల్లించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్‌ను పిచకారి చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రత్తిపాటి సునీత, వేల్పుల సునీత, బి.రవికుమార్, బుడ్డి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, కనగాల రవికుమార్, జే రత్నాకర్, రాయిడి బ్రహ్మం, వెల్లంకి రామారావు, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిటీ కుర్రోళ్లు అందరినీ ఆకట్టుకుంటుంది



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత నిహారిక, పక్కన దర్శకుడు యదు వంశీ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 9న విడుదల కానున్న కమిటీ కుర్రోళ్లు చిత్రం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుందని ఆ చిత్ర నిర్మాత కొణిదెల నిహారిక అన్నారు. ఈ చిత్రాన్ని 90లో కిడ్స్ భావోద్వేగాలను తెలుపుతూ దర్శకుడు యదు వంశీ నిర్మించారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వీక్షించి తమను ఆదరించాలని కోరారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆ సినిమా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్మాత నిహారిక మాట్లాడారు. ఈ సినిమాతో 20 మంది కొత్త కుర్రోళ్లకు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారని చెప్పారు. ఈ సినిమా ట్రైలర్ అందరినీ ఆకట్టుకున్నట్లు పేర్కొన్నారు. కమిటీ కుర్రోళ్ల కోసం మూడేళ్లుగా పనిచేస్తూనే ఉన్నట్లు తెలిపారు. డైరెక్టర్ యదు వంశీ మాట్లాడుతూ విలేజ్‌లో కొంత మంది చిన్నప్పటి నుంచి టీనేజ్, యువకులుగా మారే స్థాయి వరకూ వివిధ దశల్లో వారి మధ్య చోటుచేసుకున్న సంఘటన నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నటీ, నటులు పాల్గొన్నారు.

5 నుంచి సిద్ధార్థలో ప్లాస్మా ఎగ్జిబిషన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాల భౌతికశాస్త్ర విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసర్చ్ (అణు శక్తి విభాగం) సంయుక్తంగా ఈ నెల 5 నుంచి 9 తేది వరకు ఐదు రోజుల విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ప్లాస్మా ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ అకాడమీ సలహాదారుడు ప్రొఫెసర్ కెఎల్.మోహన్‌రావు చెప్పారు. ప్లాస్మా ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిసారిగా 32 ప్లాస్మా నమూనాలతో కూడిన ప్రదర్శన నగరంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం. రమేష్, డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉదయభాను జన్మదిన వేడుకలు



ఉదయభాను దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

జగ్గయ్యపేట అర్బన్ : మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను జన్మదిన వేడుకలను శుక్రవారం జగ్గయ్యపేటలో ఘనంగా నిర్వహించారు. అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను ఉదయభాను కట్‌చేయగా, పార్టీ నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంతోపాటు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉదయభాను అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ యూత్ సభ్యులు పట్టణ వీధుల్లో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించి పలు కూడళ్లలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారిని ఉదయభాను పేరుపేరున ఆప్యాయంగా పలకరించి, వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. పట్టణానికి చెందిన జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్, పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శి పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మైనార్టీ నేత పఠాన్ అక్బర్‌ఖాన్ తదితరులు భారీ గజమాలతో ఉదయభాను దంపతులను ఘనంగా సత్కరించారు. ఉదయభానుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఉదయభాను సతీమణి విమలాభాను, యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కొలుసు రమాదేవి, వైఎస్సార్ సీపీ పేట పట్టణ, రూరల్, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్, శ్రీనివాసగౌడ్, గాదెల రామారావు, కనకపూడి భాస్కరరావు, నియోజకవర్గ వ్యాప్తంగా ఎంపీపీలు, సొసైటీల అధ్యక్షులు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



బర్త్ డే కేక్ కట్ చేస్తున్న సామినేని ఉదయభాను, పక్కన చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, డీఈవో సత్యనారాయణరెడ్డి

కంచికచర్ల : కంచికచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలకు పరిమితమైన ఉచిత పాఠ్యపుస్తకాలను ఇంటర్ విద్యార్థులకు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం ఉచితంగా అందించగలిగితే సమాజంలో పేదవారు ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. రానున్న రోజుల్లో విద్యావ్యవస్థలో సమూల మార్పులు వస్తాయన్నారు. కళాశాలకు ఆటస్థలం, రోడ్డు తదితర అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్యను కళాశాల అధ్యాపకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డీఈవో సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ షేక్ హఫీజ్ అహ్మద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రిల్లింగ్ ఖాజా సేవలు స్ఫూర్తిదాయకం



జగ్గయ్యపేట అర్బన్: పేదలకు ఆపదలో అండగా నిలుస్తున్న డ్రిల్లింగ్ ఖాజా సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో స్వంత నిధులతో బాలసైదా సేవాసమితి పేరుతో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న సేవాసమితి అధ్యక్షుడు షేక్ ఖాజాను విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ డ్రిల్లింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఖాజా, తనకు ఉన్నంతలో సేవా కార్యక్రమాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. పేదల కోసం అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న వారిని ఉచితంగా ఆస్పత్రులకు చేరుస్తూ అనేకమంది ప్రాణాలను కాపాడుతున్నారని కొనియాడారు. అనంతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 60 మందికి గొడుగులను పంపిణీ చేశారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



కంచికచర్ల : స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢమాస ఆఖరి శుక్రవారం సందర్భంగా అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శంకర్ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిదేవీ అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com